క్లుప్తంగా

20 నుంచి కావూరి ఫౌండేషన్‌లో కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): పట్టణంలోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 20నుండి కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ పీఆర్‌ఓ పులి శ్రీరాములు ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీ, ఇంటర్ (కామర్స్) ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 20 వరకూ సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందజేస్తారని, ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన 18-35 సంవత్సరాల వయస్సు ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

బంజారా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణ



గుగ్గులోతు కృష్ణ నాయక్

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగ్గులోతు కృష్ణనాయక్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా బోడా బాల నాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆదివారం జాతీయ ఉపాధ్యక్షులు పీఎల్ రవీంద్ర నాయక్ నూతన కమిటీతో పదవీ స్వీకారం చేయించినట్లు గుగ్గులోతు కృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ లంబాడి జాతి అభివృద్ధికి కృషి చేస్తానని, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతానని అన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన గుగ్గులోతు కృష్ణ నాయక్, బోడా బాలా నాయక్‌లను పలువురు నాయకులు అభినందించారు.

చదరంగ క్రీడ అభివృద్ధికి కృషి



వాసుదేవరావును అభినందిస్తున్న వివిధ చెస్ అకాడమీల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో చదరంగ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్ వేల్పూరి వాసుదేవరావు తెలిపారు. ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్‌గా వేల్పూరి వాసుదేవరావును నియమిస్తూ ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ శర్మ ప్రకటించిన సందర్భంగా ఆదివారం నగరంలో ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ సందర్భంగా వివిధ చెస్ అకాడమీలకు చెందిన డి.లక్ష్మణరావు, జి.యెహోవాన్, వై.మహేష్, కె.కుమారి, కలిదిండి శ్వేత వాసుదేవరావును అభినందించారు.

సంక్షేమ పాలన ప్రజలకు చేరువ చేయాలి

- పార్టీ బలోపేతంలో సోషల్ మీడియాది కీలక పాత్ర
- మాజీ మంత్రి ఆళ్ల నాని



సోషల్‌మీడియా కన్వీనర్లు, నాయకులతో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు మీరంతా సైనికుల్లా పని చేయాలని, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా డివిజన్ కన్వీనర్లుగా నియమించిన 25మంది కన్వీనర్ల బృందం ఆదివారం ఎమ్మెల్యే నానిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీపై తమ విధేయత, అంకిత భావాన్ని గుర్తించి సోషల్ మీడియా కన్వీనర్లుగా నియమించటంతో ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేదవానికి అందుతున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రజాక్షేత్రంలో తమ పార్టీల అడ్రస్ గల్లంతవుతుందనే భయంతో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు. పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు నిత్యం ప్రతిపక్ష పార్టీ విష ప్రచారాలు, అసత్య ఆరోపణలను ధీటుగా ఎదుర్కోవాలని సూచించారు. ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలుపై నిత్యం ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవస్థీకృత విధానంలో పార్టీకి సేవలు అందిస్తూ రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, వాణిజ్య విభాగం నాయకులు మోటమర్రి సదానందం, కిలాడి దుర్గారావు, సోషల్‌మీడియా కన్వీనర్ కొప్పుల ప్రభాకర్‌రెడ్డి, కోకన్వీనర్ బోకినాల సురేంద్ర, విద్యార్థి నాయకులు వైఎస్‌వీ శివరావు తదితరులు పాల్గొన్నారు.

20న ప్రాజెక్టుల సందర్శన



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

ఏలూరు (టూటౌన్): చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టును ఈ నెల 20న సీపీఐ, రైతు సంఘం ప్రతినిధి బృందం పరిశీలిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి అప్పర్ భద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో సందర్శన ప్రారంభించి శ్రీకాకుళం జిల్లా వరకూ కొనసాగుతుందన్నారు. ఏలూరు జిల్లాలో ఈ నెల 20న చింతలపూడి ఎత్తిపోతలు, పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. సమావేశంలో ఆ పార్టీ నేతలు డేగా ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, మన్నవ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్న కార్మికులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవడం బాధాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మంచి ఆహారాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టు వద్ద నిత్యం అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వ శాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలాపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీనం దత్తనాథ క్షేత్రం భగవద్గీత పారాయణ బృందం సభ్యులు భగవద్గీతలోని 18 అధ్యాయాలను అత్యంత భక్తి శ్రద్ధలతో పారాయణ చేశారు. అనంతరం నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషంగా అలంకరించారు. సాయంత్రం 5.30 గంటలకు వేదాంతం విష్ణుప్రసాద్ హైందవ ధర్మ విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన రామానుజ నృత్యధార సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా అలరించాయి. అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రాంబాబు



రాంబాబు

ఏలూరు (టూటౌన్): యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నంబూరి రాంబాబు వరుసగా మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ద్వారకాతిరుమలలో యూటీఎఫ్ ఏలూరు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏలూరు మండలంలో పనిచేస్తున్న నంబూరి రాంబాబు వరుసగా మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనట్లు ఏలూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాతూరి సురేష్ బాబు, పంపన శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు మండల యూటీఎఫ్ నాయకులు కె.శ్రీధర్, తాడేపల్లి అశ్వయ్య, జి.మాధవి లత, ఓవీ ధనుంజయ రావు, బి.రవిశోభన్ కుమార్ అభినందనలు తెలియజేశారు.

ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించాలి



ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శన స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న బీబే సవిత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనోస్థైర్యం కలగాలంటే ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనకు కొంత సమయం కేటాయించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వరంగల్ జోన్ డైరెక్టర్ బీకే సవిత పిలుపునిచ్చారు. నగరంలోని బ్రహ్మకుమారీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైవ చింతనే మానసిక ప్రశాంతత నిస్తుందని, ఒత్తిళ్లను జయించడానికి భక్తి మార్గం ఒక్కటే పరిష్కారమన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శన స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన జనసేన నాయకుడు రెడ్డి అప్పల నాయుడు, బ్రహ్మకుమారి ఏలూరు సేవా కేంద్రం నిర్వాహకురాలు బీకే లావణ్య, శ్రీశ్రీ విద్యా సంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాజు సేవలు ఎనలేనివి



సుబ్బరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పని చేస్తూ, పెన్మెత్స సుబ్బరాజు విశేష సేవలు చేశారని, స్వార్థం లేకుండా చేసే ప్రతీ సేవల్లోనూ అనేక మంది పేదలకు సాయం అందుతుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని అన్నారు. ఏలూరు చోడిదిబ్బ కమ్యూనిటీ హాలులో ఇటీవల మృతి చెందిన సుబ్బరాజు సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలనీ, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, నాయకులు నున్న కిషోర్, కిలాడి దుర్గారావు, ఈదుపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

పక్షవాత బాధితుడికి సాయం



సైదు శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సేవా కార్యక్రమాల్లో బాగంగా పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక కుటుంబానికి చేయూత అందించింది. ఏలూరు మండలం కలకుర్రు గ్రామానికి చెందిన సైదు శ్రీనివాసరావు పక్షవాతంతో బాధపడుతూ కుటుంబ పోషణ భారంగా ఉండడంతో అతని ఇరువురు కుమారులు చదువు మాని కుటుంబబారాన్ని మోస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ప్రతినిధులు ఆదివారం వారి నివాసానికి వెళ్లి సైదు శ్రీనివాసరావుకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు డీకేఎస్ఎస్ ప్రకాష్, జీ. మోహన్, గుంటూరు శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరావు, ముంగర దేవి, జీ. సత్యశ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కూసింది

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా కోడ్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలుకు విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు సహాయ సహకారాలు అందించి ఫ్లెక్సీల తొలగింపునకు సహకరించాలని అన్ని గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గోపన్నపాలెంలో వారు ఫ్లెక్సీలను తొలగించారు. సోమవారం మిగిలిన గ్రామా ల్లో ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు వివరించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



గుండుగొలనులో జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 1982-83 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

భీమడోలు: నాలుగు దశాబ్దాల కితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక ఆదివారం సందడిగా సాగింది. గుండుగొలను మావులేటి సోమరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల దీనికి వేదికైంది. పాఠశాలలో 1982-83 టెన్త్ బ్యాచ్‌కు చెందిన ఐదు పదుల దాటిన 75 మంది పూర్వ విద్యార్థులంతా కుటుంబ సమేతంగా పాఠశాలకు వచ్చి తమ బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. గురువులతో పాటు పూర్వ విద్యార్థులు తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో వారంతా పులకరించారు. చిన్నతనంలో తిరిగిన ప్రాంతాలను, తరగతి గదులను సందర్శించి మధురానుభూతితో వారంతా ఆనందడోలికల్లో మునిగి తేలారు. పూర్వ విద్యార్థులు స్నేహితుల కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. పాఠాలు బోధించి విజ్ఞానమనే వెలుగులు నింపిన అప్పటి గురువులకు జీవితాంతం రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు సంఘమేశ్వరరావు, అన్నపూర్ణ, రమణకుమార్, హెచ్ఎం గారపాటి కనకదుర్గా సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడు ఉపాధ్యాయులకు సంతృప్తి లభిస్తుందని అన్నారు. వివిధ వృత్తులు, ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో, ప్రజా ప్రతినిధులుగా ఉన్నతంగా జీవిస్తున్నామని పూర్వ విద్యార్థులు తెలియజేయడంతో గురువులు సంతోషంగా వ్యక్తం చేసారు. తొలుత మృతి చెందిన తమ స్నేహితులకు నివాళులు అర్పించారు. అనంతరం గురువులతో ఫొటోలు దిగారు. అనంతరం గురువులను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక అందించారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి చేరుకునేందుకు చదువే సోపానం



నీతి కథలు చెబుతున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్

భీమడోలు: ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు పుస్తక పఠనం చక్కని సోపానమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తకపఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల నిర్వహణకు డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి ప్రోత్సాహం అందిస్తున్నారని అన్నారు. పది వారాలుగా చదవడం మాకిష్టం కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరైన చిన్నారులకు ఉచితంగా వారికి నచ్చిన పుస్తకాలను అందించేందుకు ఈనెల 14న మంగళవారం విజయవాడ పుస్తక ప్రదర్శనకు వారిని తీసుకు వెళ్లారని గ్రంథపాలకుడు కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు అందిపుచ్చుకోవచ్చన్నారు. పలు స్ఫూర్తిదాయక కథలను చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను చిన్నారులు తిలకించారు. ఈ కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, రీడర్స్ ఫోరం సభ్యుడు పీవీ రాఘవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	10	చిక్కుడు కాయలు	24
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	12-15
బెండకాయలు	44	కంద	40
పచ్చిమిర్చి	22	బీట్‌రూట్	28
కాకర కాయలు	30-36	కీరా దోస	30
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	30	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	22	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	22-32	బఠాణీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	25
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

పేదల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం

పెదవేగి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉందని, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో దెందులూరు నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆయన అన్నారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన పంది కొండలరావు, దాసరి సుబ్బారావు, సిమట నాగరాజు, పంది సుబ్బారావు, వీరమల్లు రాజును ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముండూరు సొసైటీ ప్రెసిడెంట్ చెరుకూరి ప్రసాద్, ఎంపీటీసీ కో ఆప్షన్ మెంబర్ పాకలపాటి ఫిలిప్, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ముస్సె శ్రీను, నాయకులు పంది జగన్, టి పెద్దిరాజు, పంది కొండలరావు పాల్గొన్నారు.

అనుమతుల్లేని మందుల విక్రయాలపై దాడులు

ఏలూరు టౌన్: ప్రభుత్వ అనుమతుల్లేని ఆయా కంపెనీల మందులను విక్రయిస్తున్న ఒక మెడికల్ రిప్రజెంటేటివ్‌ను అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.5లక్షల 5వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారంఏలూరు శివారు చాటపర్రులో సీ.నగేష్ అనే వ్యక్తి నివాసం ఉంటు డీకేటీ హెల్త్ కేర్ కంపెనీ సేల్స్ మేనేజర్‌గా, మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. అతను మహిళలకు సంబంధించి అబార్షన్‌కు వినియోగించే ఇతర కంపెనీలకు చెందిన ఆల్ప్రోజోలం తదితర కొన్ని రకాల మందులను అక్రమంగా స్థానికంగా విక్రయిస్తున్నాడు. తణుకు, భీమవరం ప్రాంతాల్లోని కొందరికి సైతం ఈ మందులు విక్రయిస్తున్నట్లు డ్రగ్స్ అధికారులు గుర్తించారు. అతను బీదరు, ఒడిస్సా, కర్నాటకలోని తునుకూరు ప్రాంతాల నుంచి నాగేశ్వర ఎంటర్‌ప్రైజెస్ అనే నకిలీ సంస్థ పేరిట మందులు ఏలూరుకు సరఫరా చేయిస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం భీమవరం ప్రాంతంలో మందులు అనధికారికంగా విక్రయిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. వారిని విచారణ చేయగా ఏలూరు నుంచి పంపిస్తున్నట్లు తెలిసింది. అధికారులు ఆదివారం రాత్రి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ దత్తి సునీత, తణుకు ఇన్‌స్పెక్టర్ అబీఆలీ, భీమవరం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు తమ సిబ్బందితో ఏలూరు చాటపర్రులోని నగేష్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేశారు. అనుమతుల్లేని ఆయా కంపెనీల మందులను స్వాధీనం చేసుకున్నారు. నగేష్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అనుమతుల్లేని మందులను ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపినట్లు వారు తెలిపారు.